క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆ శాఖ డివిజన్ డీఈఈ జి.ప్రసాద్ తెలిపారు. కరపలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కరపలోని 33, 11 కేవీ విద్యుత్‌లైన్‌లో దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చి, విద్యుత్ తీగలను సరిచేయడం జరుగుతుందన్నారు. మండల హెడ్‌క్వార్టర్ ఫీడర్ మరమ్మతులు చేస్తున్నామన్నారు. దీనివల్ల కరప, పేపకాయలపాలెం, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, వలసపాకల, వేములవాడ, వాకాడ, పెదకొత్తూరు, చినకొత్తూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కరప ఏఈ సానా ఈశ్వర ప్రసాద్, సబ్ ఇంజినీర్ టీవీఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం నేత బసవయ్య మృతి


పల్లేటి బసవయ్య (ఫైల్)

కరప: అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయకుడు కామ్రేడ్ పల్లేటి బసవయ్య (70) కాకినాడ జీజీహెచ్‌లో గురువారం గుండె పోటుతో మృతి చెందారు. దళిత ఉద్యమాలలో, విప్లవ ఉద్యమాలలో సుదీర్ఘకాలం పని చేసి, ప్రజల మన్ననలు పొందారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం వ్యక్తంచేశారు. కరప మండలం గొర్రిపూడికి చెందిన బసవయ్య 2014 నుంచి న్యూడెమోక్రసీ పార్టీలోను, అఖిల భారత రైతుకూలీసంఘంలోను పనిచేశారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి పి.వెంకటనాయుడు, జిల్లాఅధ్యక్షుడు జె.సత్తిబాబు తదితరులు బసవయ్యకు సంతాపం తెలిపారు.

పలువురి సంతాపం

కాకినాడ సిటీ: బసవయ్య మృతికి సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, అఖిల భారత రైతు–కూలీ సంఘం జిల్లా కమిటీలు సంతాపం వ్యక్తం చేశారు. ఎం.దుర్గాప్రసాద్, జె వెంకటేశ్వర్లు, పి.వెంకటనాయుడు, జె.సత్తిబాబు, జి సూరిబాబు, సీపీఎం నాయకులు ఎం.రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధురాలికి తీవ్రగాయాలు

కాకినాడ క్రైం: కాకినాడ కల్పన సెంటర్‌లో ఓ వృద్ధురాలిని గురువారం ఆర్‌టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్ర గాయం కాగా అపస్మారక స్థితికి చేరింది. వివరాలివీ, కాకినాడ రామకృష్ణారావు పేటకు చెందిన 68 ఏళ్ల పాలిక చంద్ర గురువారం ఉదయం ఇంటి నుంచి బయల్దేరి టీ తాగేందుకు కల్పనా సెంటర్ వద్ద ఉన్న చినగాంధీ సెంటర్‌కు వచ్చింది. వెనుక నుంచి వచ్చిన ఆర్‌టీసీ బస్సు వేగంగా వచ్చి చంద్రను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కాకినాడ టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కుట్టు మెషీన్ల పంపిణీ


మహిళలకు కుట్టు మెషీన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: మండలంలోని కొవ్వాడ గ్రామంలో స్వర్ణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మెషీన్లను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గురువారం వంపిణీ చేశారు. సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, జాన్ ప్రభాకర్, ఆర్గనైజేషన్ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

కరప: కులంపేరుతో దూషణకు, దాడికి గురై గాయాలపాలైన బాధితులకు అండగా ఉంటామని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక నక్కావారి ఎస్సీ వీధిలోని బాధితులు గొల్ల రవి, కనికెళ్ల అశోక్‌లను గురువారం రాత్రి ఆయన పరామర్శించారు. గొడవకు గల కారణాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ మురళీకృష్ణకు ఫోన్‌చేసి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీవీ రావు మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు మాతా అప్పారావు, బత్తిన శామ్యూల్, మేఘ రాజు, జార్జిరాజు తదితరులు పాల్గొన్నారు.

సగ్గుబియ్యం ఫ్యాక్టరీలో తనిఖీలు

సామర్లకోట: మండల పరిధిలోని హుస్సేన్‌పురంలో సగ్గుబియ్యం పరిశ్రమను ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ ఫ్యాక్టరీపై ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు. వివరాలు తెలపడానికి అధికారులు విముఖత చూపారు.


మెయిన్‌రోడ్డు సీతారామస్వామి ఆలయంలో కల్యాణం చేస్తున్న అర్చకులు


కరప మెరకవీధి రామాలయంలో స్వామివారి కల్యాణానికి హాజరైన భక్తులు


టూటౌన్ రామాలయంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు

జనరంజకం జానకిరాముల కల్యాణం

- రామాలయాల్లో బారులు తీరిన భక్తులు
- ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


టూటౌన్ సీతారామస్వామి మందిరంలో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన బెండా విష్ణుమూర్తిని అభినందిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి


రిజర్వులైన్ కోదండరాముని ఆలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు దంపతులు

బోట్‌క్లబ్: నగరంలో సీతారాముల కల్యాణాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి దేవస్థానంలో వాడపల్లి వెంకటరమణాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. ఈఓ బీవీఆర్ చౌదరి భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లిపాముల గణపతి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. స్థానిక అశోక్‌నగర్‌లో డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, జానకిరమ దంపతుల ఆధ్వర్యంలో నవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, విద్యాసాగర్ దంపతులు పాల్గొన్నారు. టూటౌన్ వద్ద కోదండ రాముని ఆలయంలో నిర్వహించిన కల్యాణంలో కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, నాగేశ్వరి దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రామారావుపేట శివాలయం ప్రాంగణంలో రామాలయంలోను, గాంధీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముని ఆలయంలోను కల్యాణాలు నిర్వహించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలోని రామాలయంలో కనుల పండుగగా కల్యాణం జరిగింది. ఈ వేడుకల్లో దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ విజయరాజు, జిల్లా దేవదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్ పాల్గొన్నారు. స్థానిక రేచర్లపేట, మెయిన్‌రోడ్డు సీతారామస్వామి దేవస్థానం, సూర్యారావుపేట రామాలయం, టూటౌన్ రామాలయంతోపాటు పలు ఆలయాల్లో జరిగిన సీతారామస్వామి కల్యాణోత్సవాల్లో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు. ఆయా ఆలయ కమిటీలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర విద్యాసాగర్ పాల్గొన్నారు.

కరపలో వైభవంగా కల్యాణాలు..

కరప: స్థానిక మెరకవీధి రామాలయంవద్ద ముద్రగడ నూకరాజు, రాజ్యలక్ష్మి దంపతులతో వేదపండితుడు కొక్కిరిగడ్డ సుబ్రహ్మణ్యం కల్యాణం నిర్వహించారు. సక్కా సాంబయ్య, శ్రీను ఏర్పాట్లను పర్యవేక్షించారు. పల్లపువీధి, కొత్తపేటవీధి, కూరాడ చోడిశెట్టివారివీధి, కొరిపల్లి, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, వేములవాడ, వేళంగి, సిరిపురం, యండమూరు, పెద్దాపురప్పాడు, గొర్రిపూడి, విజయరాయుడుపాలెం, పాతర్లగడ్డ, జీ.భావారం, కూరాడ, నడకుదురు, గురజనాపల్లి, జెడ్.భావారం, కొరిపల్లి, పెనుగుదురు, వాకాడ తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద కోదండరాముని కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు పానకం పోసి, ప్రసాద వితరణ చేశారు. కరప, పేపకాయలపాలెం, పెనుగుదురు, పెదకొత్తూరు, చినకొత్తూరు, వేళంగి, కూరాడ, వై.సావరం తదితర గ్రామాల్లో అన్నదానాలు నిర్వహించారు. కరపలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీ పాట్నీడి సత్య భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్‌లు కళ్యాణవేడుకల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.


వలసపాకల రామాలయంలో సాగుతున్న రాములవారి కల్యాణం

కాకినాడ రూరల్‌లో..

కాకినాడ రూరల్: వలసపాకల గ్రామంలోని రామాలయంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ దంపతులు పాల్గొన్నారు. రమణయ్యపేట ఆంజనేయనగర్‌లో 107వ సీతారాముల కల్యాణోత్సవాన్ని పిచ్చుక వీర నాగేశ్వరరావు, భానుమతి దంపతులు ఘనంగా నిర్వహించారు.

కల్యాణాన్ని తిలకించిన ఎస్పీ దంపతులు

కాకినాడ క్రైం: కాకినాడలో గురువారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పోలీస్ రిజర్వులైన్‌లో ఉన్న కోదండ రామాలయంలో ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీలు అంబికా ప్రసాద్, మురళీకృష్ణారెడ్డి, ఇతర అధికారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు పోరాటానికి 700 రోజులు

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఆందోళన 700 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏప్రిల్ ఒకటో తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని నిర్ణయించాయి. గురువారం సీఐటీయూ కార్యాలయంలో కార్మికసంఘాల ప్రతినిధులు సమావేశమై విశాఖ ప్లాంట్‌కు గుండెకాయ లాంటి బ్లాస్ట్‌ఫర్నేస్–3ని 14 నెలల నుంచి మూసివేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ను దొడ్డిదారిన బలహీనపర్చడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఒక్కదానికే రైల్వేర్యాక్‌లు కూడా ఇవ్వకుండా కేంద్రం అడ్డుపడుతుందన్నారు. 2017 నుంచి సిబ్బందికి జీతాలు, పదోన్నతులు నిలిపివేశారని వారు పేర్కొన్నారు. ప్లాంటును నష్టాల్లో చూపించి త్వరగా పోస్కో కంపెనీకి కార్పొరేట్లకు విక్రయించాలని కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. తక్షణమే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికవర్గం, రైతులు, ప్రజాసంఘాలు, ప్రజలు వర్తక వ్యాపార వర్గాలు తమ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు. శనివారం పూలే విగ్రహం వద్ద చేసే ధర్నాలో కార్మిక సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు చెక్కల రాజ్‌కుమార్, గుబ్బల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ


చీడిగలోని దశావతార వేంకటేశ్వరస్వామి


ఆలయ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల దంపతులు

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో పునర్నిర్మించిన దశావతార వేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన వెంటేశ్వర స్వామి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సుమారు రూ.2.5కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.70 లక్షలు సమకూర్చగా మిగిలిన సొమ్ములను దాతలు, గ్రామస్తులు విరాళాలుగా అందించారు. ఈనెల 25నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభించగా గ్రామస్తులు, భక్తులు సుమారు వంద మందికి పైగా వెంకటేశ్వర స్వామి దీక్ష చేపట్టారు. గురువారం ఉదయం 9.30 గంటలకు అలివేలు మంగాదేవి, గోదాదేవి సమేత దశావతార వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, శ్రీవిద్య దంపతులు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సతీష్‌కుమార్, ఆలయ ధర్మకర్త గుడాల రామకృష్ణ, కొప్పిశెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

భీమకవి సమాధిని దర్శించిన వేములవాడ వాసులు


అనంతపురం జిల్లా గడికల్లులోని భీమలింగేశ్వరస్వామి జీవసమాధి మఠాన్ని దర్శించుకున్న వేములవాడ గ్రామస్తులు


గడికల్లులోని జీవసమాధి మఠం

కరప: మండలం వేములవాడ గ్రామానికి చెందిన కొంతమంది భక్తులు అనంతపురం జిల్లా నిడసనకల్లు మండలం గడికల్లులోని వేములవాడ భీమకవి జీవసమాధి మఠం, భీమలింగేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. వేములవాడ మాజీ సర్పంచ్, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు కమిడి శంకర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఉద్దండ సూర్యనారాయణ మరో నలుగురు వేములవాడ భీమలింగేశ్వరస్వామి జీవసమాధి మఠాన్ని దర్శించుకుని వచ్చారు. వేములవాడ భీమకవిది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, కరప మండలం వేములవాడలో జన్మించినట్టు మాజీ సర్పంచ్ బండే తాతాజీ గురువారం తెలిపారు. దేశాటనకు వెళ్లిన భీమకవి అనంతపురం జిల్లాలోని గడేకల్లులో జీవసమాధి చెందారన్నారు. చరిత్ర ఆధారాలు లేకపోవడంతో అంతగా వెలుగులోకి రాలేదన్నారు. భీమకవి వంశీయులు స్థానిక వేములవాడ శివాలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటుంటారని, ఇక్కడనుంచి ప్రతి సంవత్సరం జీవసమాధిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకుంటారని తాతాజీ తెలిపారు.

నేడు మండల సమావేశం

కాకినాడ రూరల్: రమణయ్యపేట మండల పరిషత్ సమావేశం శుక్రవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఎంపీపీ గోపుశెట్టి పద్మజ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరవ్వాలని ఎంపీడీఓ శ్రీనివాస్ కోరారు.

ఆసరా మూడో విడత సంబరాలు..

మండల పరిషత్ పరిధిలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శుక్రవారం ఆసరా పథకం కింద చెక్కులు పంపిణీ చేయనున్నారు. సర్పవరం జంక్షన్ వద్ద స్పందన ఫంక్షన్ హాలులో ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందని మండల అధికారులు తెలిపారు.

నయనానందం నర్తనోత్సవం


విద్యార్థులు ప్రదర్శిస్తున్న నృత్యరూపకం

కాకినాడ కల్చరల్: చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకొన్నాయి. స్థానిక సూర్యకళామందిర్‌లో శ్రీసూర్య నృత్యనికేతన్ నాట్యాచారిణి ఎం మహాలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 'ఉగాది నర్తనోత్సవం' నిర్వహించారు. భారత సంస్కృతికి చిహ్నాలైన కళలకు పూర్వవైభం తీసుకువచ్చేందుకు తనవంతు కృషి చేస్తున్నానని మహాలక్ష్మి అన్నారు. పలువురు వక్తలు శ్రీసూర్య నృత్యనికేతన్ కళారంగ సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు ఇదిగో భద్రాద్రి.., శ్రీగణనాథం.., శివాష్టకం.., కొలువైయున్నాడే.. తదితర నృత్యరూపకాలు ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో చివరిగా నిర్వహించిన కోలాటం విశేషంగా ఆకట్టుకొంది. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

అరకొర పనులు.. అవస్థలు..

- నిధులున్నా పనుల్లో జాప్యం
- ఏడాదిగా సాగుతున్న రహదారి నిర్మాణం
- రూ 18.5 కోట్లతో మొదలు పెట్టిన అరట్లకట్ట రహదారి పనుల తీరిది..

కరప: మండలంలోని కరప, పెదపూడి మండలాలను అనుసంధానించే అరట్లకట్ట రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కరప నుంచి అరట్లకట్ట, కొరిపల్లి, జెడ్.భావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల మీదుగా పెదపూడి మండలం కరకుదురుకు కలిపే ఈ రహదారి ఇంద్రపాలెం మీదుగా కాకినాడ వెళ్లేందుకు దగ్గర దారి. అలాగే పెదపూడి, జి.మామిడాడ గ్రామాలకు వెళ్లేందుకు సులువైన దారి. ఈ అరట్లకట్ట రోడ్డు సింగిల్ వేగా ఉండేది. రోడ్డు కూడా గోతులు పడి ధ్వంసమైంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు నరకయాతన పడేవారు. ఆయా గ్రామాల ప్రజల వినతి మేరకు 2021లో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు స్పందించి ఆధునీకరణకు మంజూరు రూ.18.5 కోట్లు మంజూరు చేయించారు. గత ఏడాది ఏప్రిల్ 25న ఎంపీ వంగా గీతతో కలసి ఈ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు.


గొడ్డటిపాలెం సమీపంలో రోడ్డు విస్తరణకు తవ్వి వదిలేసిన భాగం

కరప నుంచి దోమాడ మీదుగా..

కరప, పెదపూడి, కాకినాడ రూరల్ మండలాలను అనుసంధానం చేసే రహదారి అభివృద్ధికి గ్రామాల్లో సీసీ రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా సీసీ డ్రెయిన్లు, రహదారి మధ్యలో కల్వర్టులు, అరట్లకట్ట వద్ద వంతెన నిర్మించాల్సి ఉంది. సింగిల్‌రోడ్డుగా ఉండే అరట్లకట్టరోడ్డు వెడల్పుచేసి, బీటీ రోడ్డు వేయాలి. కరప, కొరిపల్లి, గొడ్డటిపాలెం, జెడ్.భావారం గ్రామాల్లో సీసీ డ్రెయిన్లు చేపట్టి ముక్క, ముక్కలుగా వేసి పూర్తిచేయకుండా వదిలేశారు. రోడ్డు వెడల్పు చేసేందుకు గోతులు తవ్వి వదిలేయడం, సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి కంకర, ఇసుక రోడ్డుపై వేసి వదిలేశారు. ఈ పనులు సత్వరం పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


జెడ్ భావారం సమీపంలో రోడ్డు పక్కవేసిన కంకర


కొరిపల్లిలో రోడ్డుకు ఇరువైపులా అసంపూర్తిగా వదిలేసిన సీసీ డ్రెయిన్

కూలీలు సొంతూళ్లకు వెళ్లడం వల్లే జాప్యం

అరట్లకట్ట రోడ్డు విస్తరణ, సీసీ డ్రెయిన్ల నిర్మాణపనుల్లో జాప్యం వాస్తవమే. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు వారి సొంత ఊళ్లకు వెళ్లడం వల్ల పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

– బీవీఎస్ వర్మ, డీఈఈ

అసంపూర్తి పనులతో ప్రమాదాలు..



రోడ్డు వెడల్పు చేసేందుకు గోతుల తవ్వేసి వదిలేశారు. రోడ్డుపక్క వేసిన కంకర, ఇసుక రోడ్డుపైకి వచ్చి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అధికారులు స్పందించి విస్తరణ పనులు పూర్తిచేయించాలి.


– సింగినేని వెంకటేశ్వరరావు, గొడ్డటిపాలెం

రిజర్వేషన్ వేళల కుదింపు

- ఒకటో తేదీ నుంచి అమలు
- ఆందోళనలో ప్రయాణికులు
- రేపు ధర్నాకు సమాయత్తం

సామర్లకోట: రైల్వే రిజర్వేషన్ కౌంటర్ల పనివేళలు శనివారం నుంచి కుదించడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో అసలే అరకొర సదుపాయాలతో సతమతమవుతున్న ప్రయాణికులు రైల్వే అధికారుల తాజా ఉత్తర్వులతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేసే రిజర్వేషన్ కౌంటర్లు ఏప్రిల్ ఒకటో తేదీ శనివారం నుంచి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 వరకు, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు స్థానిక అధికారులు తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సామర్లకోట రైల్వే జంక్షన్ కావడంతో కాకినాడతో పాటు జగ్గంపేట, పిఠాపురం, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం తదితర ప్రాంతాల నుంచి ప్రయాణికులు సామర్లకోట వచ్చి ఆయా ప్రాంతాలకు టిక్కెట్లు రిజర్వేషన్లు చేయించుకుంటారు. ప్రస్తుతం ఈ కుదింపుతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి.


రిజర్వేషన్ కౌంటర్ల సమయం పెంచాలి



జిల్లా నలు మూలల నుంచి ఆయా ప్రదేశాలకు రాకపోకలు చేయడానికి సామర్లకోట వచ్చి రిజర్వేషన్లు చేయించుకొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు ఉన్న సమయాన్ని పెంచాలి. రిజర్వేషన్ కౌంటర్ల పనివేళల కుదింపుపై శనివారం రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తాం.

– ఇరుసుమళ్ల సాయి, సామర్లకోట

ఏలూరు, సామర్లకోటలకు కొత్త జీఓ..



ఏలూరు, సామర్లకోట రైల్వే స్టేషన్లలో రిజర్వేషన్ల కౌంటర్ల సమయం కుదిస్తూ విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఏప్రిల్ ఒకటి నుంచి ఈ సమయం అమలులోనికి వస్తుంది. సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. నిత్యం రిజర్వేషన్ కౌంటర్లు రద్దీగా ఉంటున్నాయి.

– ఎం రమేష్, రైల్వే స్టేషన్ మేనేజరు, సామర్లకోట